సాక్షి
పల్నాడు
గురువారం | 3 | జులై | 2025



## సాల్వేషన్ ఆర్మీ వార్షికోత్సవం

తెనాలిఅర్బన్: సాల్వేషన్ ఆర్మీ వార్షికోత్సవం బుధవారం ఐతానగర్‌లోని చర్చి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గేరా థామస్, సీయోను కుమారిలు జెండా ఎగురవేశారు.



## పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

నరసరావుపేట: క్యాంపు కార్యాలయంలో బుధవారం పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమా పథకం పోస్టర్లను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు.



## శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

నగరం: జిల్లేపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు.

## న్యూస్‌రీల్

### పంటలకు బీమా చేయించుకోండి



నరసరావుపేట రూరల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో మిరప, కంది, వరి పంటలను ఖరీఫ్ సీజన్‌కు ఎంపిక చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పమిడిపాడు, కేతముక్కల అగ్రహారం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏఈఓ ఐ.శాంతిలు పాల్గొని పత్తి పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంటలకు బీమా చేసుకోవాలన్నారు. మిరపకు ఎకరానికి రూ.360, వరికి రూ.80, కందికి రూ.40 బీమా ప్రీమియంను చెల్లించి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు అశోక్, పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### లక్ష్మీనారాయణకు పీఆర్కే పరామర్శ



సత్తెనపల్లి: తన చావుతోనైనా పోలీసుల అరాచకాలు ఆగాలని పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాజుపాలెం మండలం పెద్దనెమలిపురి గ్రామానికి చెందిన గుత్తా లక్ష్మీనారాయణను వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిలు బుధవారం పరామర్శించారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు మనస్థాపానికి గురైన లక్ష్మీనారాయణ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం పాఠకులకు విదితమే. నాయకులు మాట్లాడుతూ అధైర్య పడవద్దని, అండగా ఉంటామని, ప్రశాంతంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా వారికి లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపాడు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పండుగ వేడుకలను పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. హజరత్ మొహమ్మద్ మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ వేడుకలు జరుపుకొన్నారు. ఏడవ రోజు బుధవారం ప్రధాన రహదారిలోని పీర్ల చావిడిలో హజరత్ అలీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొల్లా ముజావర్ల కమిటీ మొల్లా కరీమ్, మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, షేక్ , ఖాదర్, మొల్లా అల్లాబక్షి, మొల్లా నజుముద్దీన్, మొల్లా ఖాలీల్ బాషా, మొల్లా బాజి, షేక్ గౌస్, మొల్లా రహంతుల్లా, మొల్లా అర్షద్, మొల్లా జలీల్, మొల్లా ఇమ్రాన్, మొల్లా జైనులాబద్దీన్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడి బదులు భార్య విద్యా బోధన



పెనుమర్రు(వేమూరు): మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడి నిర్వాకంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా జవ్వాది శ్రీనివాసరావు ఉండగా, ఆయన తన భార్యను తీసుకొచ్చి పిల్లలకు పాఠాలు చెప్పిస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా తంతు జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఇంతవరకు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఉపాధ్యాయుడు, అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా శ్రీనివాసరావు స్థానంలో ఆయన భార్య పాఠాలు బోధించడం గమనించిన స్థానికులు ఆమెను నిలదీశారు.



సమావేశానికి హాజరైన మహిళలు, నాయకులు



సమావేశానికి హాజరైన పల్నాడు, గుంటూరు జిల్లాల నాయకులు

# కూటమి వంచనను ఎండగడదాం

**వైఎస్సార్ సీపీ పల్నాడు - గుంటూరు జిల్లాల నేతల విస్తృత స్థాయి సమావేశం**

- ఇంటింటికి చంద్రబాబు మోసాలు
- హామీలు ఇచ్చి నెరవేర్చపోవడం చంద్రబాబుకు ఇది మొదటిసారి కాదు
- వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- కూటమి సర్కారు మోసాలను, సూపర్ సిక్స్ వైఫల్యాలను ఇంటింటికి వివరించాలి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీల అమలును పక్కనబెట్టి ప్రజలను మరొకసారి నిలువునా వంచించారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి రూరల్‌లోని కుంచనపల్లి ఫార్చ్యూన్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే జిల్లాస్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం కొత్తేమి కాదని, 1999 నుంచి ఆయన ఇదే పద్ధతి అవలంభిస్తున్నారని దుయ్యబట్టారు.

- జిల్లా, నియోజకవర్గ, మండల, వార్డు, గ్రామస్థాయిల్లో సమావేశాలు నిర్వహించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలులను, చంద్రబాబు ప్రభుత్వం మోసగించిన విధానాన్ని ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ఎన్నికలకు ముందు ఏఏ పథకాలు వస్తాయని బాండ్లు ఇచ్చారో, వాటిని సేకరించి వారికి ఏఏ పథకాలు రాలేదో తెలుసుకుని, మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో వచ్చిన సంక్షేమ పథకాలను వివరించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటారని, జెండా మోసిన వారికి, పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి, వినుకొండ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, తెనాలి సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), గుంటూరు, పల్నాడు జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పోరాటాలు మనకు కొత్తకాదు

పోరాటాలు వైఎస్సార్ సీపీకి, మనకు కొత్త కాదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టిన దగ్గర నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. అరాచక పాలనను తిప్పికొట్టాలంటే మన చేతిలో ఉన్న ఆయుధం సెల్‌ఫోన్. సామాజిక మాధ్యమం వేదికగా ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను, ప్రజల సమస్యలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రభుత్వ బండారాన్ని బయటపెట్టేందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సిద్ధం కావాలి.

– కాసు మహేష్‌రెడ్డి,
గురజాల మాజీ ఎమ్మెల్యే

### తక్కువ కాలంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత

ఇంత తక్కువ కాలంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వానికి ఇంత ప్రజా వ్యతిరేకత రాలేదు. ఎటు చూసినా దోపిడీలే.. కూటమి కార్యకర్త సైతం దొరికిందల్లా దోచుకుంటూ ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నాడు. ప్రశ్నిస్తే కేసులు పెడతారనే భయంతో ప్రజలు బయటకు రావడం లేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటకు రాగానే తల్లికి వందనం అందజేశారు. లేకుంటే అమలు చేసేవారే కాదు. మన కార్యకర్తలు ప్రశ్నించడం మొదలు పెడితే ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత ప్రారంభమవుతుంది. బాబు ష్యూరిటీ–మోసాలు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.

– బొల్లా బ్రహ్మనాయుడు,
వినుకొండ మాజీ ఎమ్మెల్యే

### కార్యకర్తలే వారధులు

వైఎస్సార్ సీపీకి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నడుమ కార్యకర్తలే వారధులు. ఎన్నికలకు ముందు రెండు అబద్ధాలు చెప్పి ఎన్నికల్లోకి వెళదామని పలువురు నాయకులు చెప్పినా వైఎస్ జగన్ అందుకు ఒప్పుకోలేదు. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తున్నాం. కూటమి ప్రభుత్వానికి ఏడాదిలోపే వ్యతిరేక సెగ భారీగా తగులుతోంది. మన నాయకుడు ఒక్క రెండుసార్లు బయటకు వస్తే అధికారుల్లోను, ప్రభుత్వంలోనూ మార్పు కనిపిస్తోంది. మనం పూర్తిస్థాయిలో పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం.

– మోదుగుల వేణుగోపాలరెడ్డి,
పార్టీ పల్నాడు, గుంటూరు జిల్లాల పరిశీలకులు

### కేసులకు భయపడం

వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు కేసులు కొత్తేమీ కాదు. నాపై ప్రభుత్వం 90 కేసులు పెట్టింది. మన ఎమ్మెల్యేలు, ఎంపీలపై అనేక కేసులు పెడుతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రజా పరిపాలన చేసేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.

– పూనూరు గౌతమ్ రెడ్డి,
నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు

### పూర్తిస్థాయిలో ప్రజల్లోకి..

వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు ఇప్పటికే గమనించారు. ప్రశ్నించిన వారిపై కొంతమంది టీడీపీ నాయకులు దాడి చేస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నమ్మకం సన్నగిల్లుతోంది. పార్టీ సూచనల మేరకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లే విధంగా కృషి చేద్దాం.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి,
పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు

# అమ్మ ఆరోగ్యంపై కత్తి

**జిల్లాలో పెద్ద సంఖ్యలో సిజేరియన్లు**

- పల్నాడులో 55 శాతానికి పైగా ఆపరేషన్లే..
- రోజురోజుకు తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- కానుల కోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక భాగం సిజేరియన్లే
- నొప్పుల భయం, మంచి ముహూర్తాల కోసం ఒత్తిడి చేస్తున్న గర్భిణులు, కుటుంబ సభ్యులు
- తల్లుల ఆరోగ్యంపై పెను ప్రభావం.. శిశువులకూ నష్టం
- సిజేరియన్ల సంఖ్య అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్న డీఎంహెచ్ఓ



**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల తీరు**

| సంవత్సరం | మొత్తం ప్రసవాలు | సిజేరియన్లు | అసిస్టెడ్ |
|---|---|---|---|
| 2022-23 | 6,594 | 3,045 | 64 |
| 2023-24 | 7,631 | 3,766 | 118 |
| 2024-25 | 7,451 | 3,801 | 114 |

సాక్షి, నరసరావుపేట: పంటి బిగువన నొప్పిని భరించి, ప్రసవవేదనను అనుభవించి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. కానీ కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల కాసుల కక్కుర్తి వల్లనో, నొప్పులు భరించలేమనో, ముహూర్తాల ప్రకారం జన్మనివ్వాలనో చాలా మంది మాతృమూర్తులకు సిజేరియన్లు చేసి బిడ్డను భూమిపైకి తెస్తున్నారు. దీంతో అవసరం ఉన్నా, లేకున్నా కాన్పు కోతలు పెరిగిపోతున్నాయి. ఇది తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ముప్పు తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. వాస్తవంగా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలి. ఇది మొత్తం కాన్పుల్లో 25 శాతానికి మించకూడదు. అయితే పల్నాడు జిల్లాలో ఇది 55 శాతం పైగా ఉంటోంది. ప్రభుత్వ వైద్యశాలలో జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 7,451 ప్రసవాలు జరగగా అందులో 3,801 మందికి సిజేరియన్ చేశారు. ప్రైవేట్ వైద్యశాలల్లో అయితే ఇది 60 శాతం దాకా ఉంటోంది.

**కాన్పుకు వెళితే కోతే...**

సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు, కడుపులో బిడ్డ సరిగా లేనప్పుడే సిజేరియన్లు చేయాలి. కానీ కొంతమంది వైద్యులు ఆపరేషన్లకే మొగ్గు చూపుతున్నారు. సంపాదనే లక్ష్యంగా కొన్ని ప్రైవేట్ వైద్యశాలలు తల్లుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సహజ ప్రసవానికి అవకాశం ఉన్నప్పటికీ.. ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డం తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకుంటోందని, పురిటి నొప్పుల బాధ భరించలేరని పేర్కొంటూ బాధిత బంధువులను భయపెట్టి అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్నారు. సిజేరియన్ ప్రసవాలు తరచూ కడుపు నొప్పి, ఇన్‌ఫెక్షన్, అధిక బరువు, నెలసరి వంటి సమస్యలకు కారణమవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.


**సాధారణ ప్రసవాలతో ప్రయోజనాలు**

సాధారణ ప్రసవాల వల్ల తల్లి, పిల్లలకు బహుళ ప్రయోజనాలు అందుతాయి. సాధారణ ప్రసవాల్లో మహిళలు రెండు రోజుల్లోనే ఎప్పటిలా పనులు చేసుకోవడానికి వీలుంటుంది. రెండో కాన్పుపై దుష్ప్రభావం ఉండదు. గర్భసంచికి ప్రమాదం ఉండదు. భవిష్యత్తులో రుగ్మతలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. పుట్టిన బిడ్డకు సైతం మొదటి గంటలో తల్లిపాలు అందించవచ్చు.

### తల్లీ బిడ్డలకు నష్టం

ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఎక్కువగా జరుగుతున్న సిజేరియన్ల వల్ల తల్లికి, బిడ్డకు అధిక నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆపరేషన్లు చేయించుకోవడం వల్ల లాభాల కన్నా నష్టాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు తాగితే అవి అమృతంతో సమానం అంటున్నారు. శస్త్ర చికిత్సల కారణంగా మొదటి గంటలో తల్లిపాలు తాగే వీలు లేకుండా పోవడంతో శిశువు ఎదుగుదల, అనంతరం జీవితాంతం అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. రక్తస్రావం అధికమైనా, ఇతరత్రా సమస్యలు తలెత్తినా ప్రాణాపాయంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. గర్భాశయానికి గాట్లు పెట్టి కుట్టు వేసిన ప్రాంతంలో మాయ అతుక్కుపోయే అవకాశాలుంటాయి. దీంతో అప్పుడప్పుడు తీవ్ర కడుపు నొప్పి సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భ సంచి తొలగించే పరిస్థితి ఏర్పడవచ్చు.

### అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో సాధారణ ప్రసవాలు ఎక్కువ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా గర్భిణులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సిజేరియన్ వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించి అవగాహన పెంచుతున్నాం. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. అటువంటి ఆస్పత్రులను గుర్తించి, మెమోలు అందజేస్తున్నాం, ప్రత్యేకంగా ఆడిట్ చేస్తున్నాం. గర్భిణులు, కుటుంబ సభ్యులు సైతం సిజేరియన్ల వైపు మొగ్గు చూపకుండా, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి.

– డాక్టర్ బి.రవి,
డీఎంహెచ్‌ఓ, పల్నాడు జిల్లా

# 'నాన్ మస్టర్' కార్మికుల వేతనాల పెంపు

**ఆమోదం తెలిపిన జిల్లా కలెక్టర్**



అధికారులతో సమావేశమైన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో నాన్ మస్టర్‌రోల్ విధానంలో పనిచేసే కార్మికుల వేతనాల పెంపుదలకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆమోదం తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి నాన్ మస్టర్‌రోల్ వేతనాల స్థిరీకరణ సమావేశం బుధవారం నిర్వహించారు. అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికుల వేతనం రోజుకు రూ.864 నుంచి రూ.899కి పెంచారు. నైపుణ్యం కలిగిన కార్మికుల వేతనం రూ.855, పాక్షిక నైపుణ్య కార్మికుల వేతనం రూ.742, నైపుణ్యంలేని కార్మికుల వేతనం రూ.619గా నిర్ధారించారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు తాత్కాలిక అవసరాల కోసం రోజువారీ ప్రాతిపదికన పనిచేసే నాన్ మస్టర్‌రోల్ కార్మికులకు నూతనంగా నిర్ధారించిన వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సీపీఓ జి.శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, డీఈఓ చంద్రకళ, నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎస్ఈ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఖాతాకు పింఛన్ సొమ్ము జమ

- పింఛన్ సొమ్మును వ్యక్తిగత ఖర్చులకు వాడుకున్న యడ్లపాడు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్
- అధికారుల హెచ్చరికలతో తిరిగి చెల్లింపు

యడ్లపాడు: సామాజిక భద్రత పింఛన్ల నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యడ్లపాడు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చివరకు ప్రభుత్వ ఖాతాకు నగదును తిరిగి జమ చేశారు. దాదాపు నాలుగు నెలలుగా పంపిణీ చేయని పింఛన్ సొమ్ము రూ.9,50,500 సొంత ఖర్చులకు వాడుకున్నట్లు ఇటీవల అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. యడ్లపాడు–1,2 సచివాలయాల పరిధిలో పంపిణీ కాని పెన్షన్ నగదు ప్రతి నెలా 7వ తేదీలోపు ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉండగా, వెల్ఫేర్ అసిస్టెంట్ వీటిని ఉల్లంఘించి నకిలీ చలానాలు సమర్పిస్తూ, నగదును దారి మళ్లించినట్లు డీఆర్‌డీఏ అధికారుల తనిఖీల్లో గుర్తించారు. ఈవిషయం తెలియగానే ఎంపీడీఓ వి.హేమలతదేవికి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఎంపీడీఓ 24 గంటల్లోనే నగదు తిరిగి జమ చేయకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామంటూ మంగళవారం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సదరు అసిస్టెంట్ బుధవారం ఉదయం పూర్తి మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

# వైద్యులపై లాఠీచార్జి దుర్మార్గం

పిడుగురాళ్ల: వైద్యులపై పోలీసుల లాఠీచార్జి దుర్మార్గమైన చర్యని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం అశోక్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్స్ డే రోజున మంగళవారం విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకొన్న వైద్యులు తమకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలంటూ విజయవాడలో శాంతియుత నిరసన చేస్తే వారిపై ప్రభుత్వం లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. సాక్షాత్తు వైద్యశాఖ మంత్రి వైద్యులపై నోరు జారడం తగదన్నారు. హెల్త్ మినిస్టర్ ఆదేశాలతోనే పోలీసులు వైద్యులపై లాఠీ చార్జి చేశారని, వారిని బలవంతంగా పోలీస్ వాహనాలు ఎక్కించి పోలీస్ స్టేషన్‌లకు తరలించడం సిగ్గు చేటన్నారు.

## క్లుప్తంగా

### రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం కృష్ణా కెనల్ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది జీఆర్‌పీ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 55–60 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆచూకీ తెలిపే ఆధారాలు ఏవీ లభ్యం కాలేదని తెలిపారు. వంటిపై గాయాలను బట్టి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

## మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 46,390 |
| అమ్మకాలు | 45,224 |
| నిల్వ | 10,119 |

**నాన్ ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | రూ. 9,500 – 13,000 |
| నంబరు–5 | రూ. 10,000 – 13,200 |
| 273 | రూ.10,000 – 12,500 |
| 341 | రూ. 10,000 – 13400 |
| సూపర్ –10 | రూ. 9,700 – 12,400 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | రూ. 10,000 – 14,000 |
| బాడిగ – 355 | రూ. 10,000 – 12,800 |
| దేవనూరు డీలక్స్ | రూ. 10,000 – 12,600 |
| ఆర్మూర్ | రూ. 9,700 – 11,000 |
| తాలుకాయలు | రూ. 5,000 – 6,700 |

**ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | రూ. 9,500 – 12,800 |
| నంబరు–5 | రూ. 10,000 – 13,300 |
| 341 | రూ. 10,000 – 13,200 |
| 4884 | రూ. 10,000 – 12,400 |

**ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | రూ. 10,000 – 13,600 |
| బాడిగ – 355 | రూ. 10,000 – 12,800 |
| దేవనూరు డీలక్స్ | రూ. 10,000 – 12,500 |
| తాలుకాయలు | రూ. 5,500 – 7,000 |

–కొరిటిపాడు (గుంటూరు)

# అడుగడుగునా 'నకిలీ' పురుగులు!

**అన్నదాతలను ముంచేస్తున్న డొల్ల కంపెనీలు**

- మార్కెట్లో నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు
- నమ్మకంతో కొనుగోలు చేసి నష్టాలపాలవుతున్న రైతులు
- కొనే సమయంలోనే అన్నివిధాలా అప్రమత్తత అవసరం
- అనుమతి ఉన్న దుకాణాల నుంచి తీసుకుంటేనే మేలు

మార్కెట్లోకి 'నకిలీ' పురుగులు వచ్చేస్తున్నాయ్.. ఆరుగాలం శ్రమించే రైతన్న కష్టాన్ని దోచుకునేందుకు వేచి చూస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విషయంలో కాస్త ఏమరుపాటుగా ఉండి నకిలీవి కొనుగోలు చేస్తే నట్టేట మునగక తప్పదు. అటు డబ్బు, ఇటు సమయం మట్టిపాలు కావడం ఖాయం. అప్రమత్తతే అన్నదాతకు రక్షణ కవచంగా నిలవనుంది.



ముప్పవరంలో నకిలీ ఎరువులు, పురుగు మందులను పట్టుకున్న అధికారులు (ఫైల్)

జె.పంగులూరు: ఖరీఫ్ సీజన్ వచ్చింది. రైతులను ఆకర్షించేలా కొత్త పురుగుల మందులు, విత్తనాల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు ముందుగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో అనుమతులు లేని కంపెనీలవి మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గంలో రైతులు ఎక్కువ శాతం మిర్చి, పత్తి, కురగాయల విత్తనాలను మార్టూరు, చిలకలూరిపేట, నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేస్తారు. జె.పంగులూరు మండల పరిధిలోని ముప్పవరంలో విత్తనాలు, పురుగుమందు అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఈ విక్రయాలు సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**30 ఎకరాల్లో నష్టపోయిన రైతులు**

ఏటా ముప్పవరం గ్రామంలో కొన్న రైతులు పలువురు నష్టపోతున్నారు. మూడేళ్ల క్రితం ముప్పవరం గ్రామ శివారులో పెద్ద ఎత్తున నకిలీ పురుగుల మందులు, ఎరువులను సీజ్ చేశారు. అధికారుల అండదండలతో నకిలీ దందా నడుస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. పురుగుల మందుల దుకాణదారులు బిల్లులు ఇవ్వకుండా తెల్లకాగితంపై రాసిస్తున్నారు. అయినా అధికారులు ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ఏడాది మండల పరిసర ప్రాంతాల్లోని ముప్పవరం, కొండమూరు, బైటమంజులూరు, జాగర్లమూడివారి పాలెం మొక్కజొన్న రైతులను అగస్త్య కంపెనీ నిలువునా ముంచింది. మండలంలో నాలుగు గ్రామాల్లో మొక్కజొన్న చేలల్లో కలుపు రావడంతో తొలగించుకునేందుకు ముప్పవరంలో హనుమాన్ ట్రేడర్స్ షాపు వద్ద అటరాజిన్ మందును తీసుకెళ్లారు. మందు వేసిన 15 రోజుల తర్వాత దాదాపు 30 ఎకరాల్లో పైరు ఎండుముఖం పట్టింది. ఆకులు ఎండిపోతూ, మచ్చలు పడి, ఎర్రగా మారిపోయింది. కొంతమంది రైతులు పైరును దున్ని మళ్లీ సాగు చేసినా ఆ పైరు కూడా ఇదే విధంగా వస్తోందని వాపోయారు.



నకిలీ కలుపు మందు వాడటంతో ఎండిపోయిన మొక్కజొన్న పైరు

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారుల నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయకూడదు. సరుకు ల్యాబ్ నంబర్, తయారీ తేదీ, కాలపరిమితి గడువు, రకం, ఇలా అన్ని వివరాలు ఉండాలి. సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంచులు సీలు విప్పినట్లు లేదా విప్పి తిరిగి కుట్టినట్లు కనిపిస్తే వాటిని కొనరాదు. విత్తన బస్తాతో లభించే ట్యాగ్‌ను ఏడాదిపాటు భద్రంగా ఉంచుకోవాలి.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకారం సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి.

### మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

నకిలీ కలుపు మందు చల్లి గత ఏడాది నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఇంత వరకు నష్టపరిహారం వచ్చిన దాఖలాలు లేవు. తక్షణమే చెల్లించాలి. ఎరువులు, పురుగు మందుల విత్తనాలు అన్నింట్లో కల్తీయే. అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అగస్త్య కంపెనీపై చర్యలు తీసుకోవాలి. నష్టపోయినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు.

– రామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, బాపట్ల

### అనుమతులు లేనివి కొనుగోలు చేయొద్దు

ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోకండి. బ్యాచ్ నంబరు లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. కొన్న వెంటనే దుకాణం నుంచి బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లును పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలి. ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదు.

– సుబ్బారెడ్డి, ఏఓ

### రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే !



ప్రత్తిపాడు: రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రత్తిపాడు వైఎస్సార్ కాలనీలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు చల్లగిరి నాగరాజు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కౌలు రైతు నాగరాజు పంటలు పండకపోవడం, గిట్టుబాటు ధరలు, కౌలు రైతు కార్డు లేకపోవడం, బ్యాంకులు రుణం ఇవ్వకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని తెలిపారు. ప్రైవేటు సంస్థల నుంచి వందకు మూడు నుంచి ఐదు రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చి, అవి తిరిగి చెల్లించలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు.

**ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**

ప్రభుత్వం వెంటనే స్పందించి నాగరాజు కుటుంబానికి రూ. 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎకరం ప్రభుత్వ భూమిని ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేసి, తిరిగి నూతనంగా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి, పొగాకు సాగు చేసిన 10 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు నివారిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. పరామర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, నాయకులు కె. ఆదినారాయణ, నల్ల మోతు రాజేంద్ర ఉన్నారు.

## భూముల సమీకరణ ఉపసంహరించుకోవాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ప్రభుత్వం రాజధాని కోసం మరో దఫా 44వేల ఎకరాలు భూమిని సమీకరిస్తున్నట్లు ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. 11 సంవత్సరాల కిందట తీసుకున్న 34వేల ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములతో కలిపి 54వేల ఎకరాలు అందుబాటులో ఉందని తెలిపారు. మరో 44 వేల ఎకరాలు తీసుకోవడం అంటే అది అమరావతి రైతుల ప్రయోజనాలకు విఘాతమని విమర్శించారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నోచుకోలేదని పేర్కొన్నారు. సమీపంలో గన్నవరం విమానాశ్రయం ఉండగా అంతర్జాతీయ విమానాశ్రయం ఎందుకని ప్రశ్నించారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూములు తీసుకున్నారని, అది ఇప్పటికీ కొలిక్కి రాలేదని తెలిపారు. రాజధాని కొలిక్కి రాకుండా అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో ఇప్పుడు వేల ఎకరాల భూములు సమీకరించడం సబబు కాదని ఖండించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళీనికాంత్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆరవపల్లి వద్ద గడ్డితో పూడుకుపోయిన వాడ మురుగు డ్రెయిన్



గుడ్డికాయలంక అక్కిలేరు వద్ద రేపల్లె మురుగు డ్రెయిన్‌లో తూటికాడ

# ఖరీఫ్‌లో ముంపు ముప్పు

- గుర్రపు డెక్క, తూటి కాడతో పూడుకుపోయిన డ్రెయిన్లు
- పూడిక తీసేందుకు కనీస చర్యలు చేపట్టని కూటమి సర్కార్
- ఈ ఏడాది పంటకు ముంపు తప్పదని ఆందోళనలో అన్నదాతలు
- నాడు ఖరీఫ్‌కు ముందే పనులు పూర్తి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ఖరీఫ్‌లో వరి పంటకు ముంపు ముప్పు తప్పేలా లేదు. రేపల్లె నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ప్రధాన మురుగు కాలువలతోపాటు మైనర్, రోడ్డు పక్కన ఉన్నవి కూడా గుర్రపు డెక్క, తూటికాడ, గడ్డి వంటి చెత్తతో పూడిపోయాయి. వర్షాలు ఊపందుకుంటే నీరు ముందుకు సాగని స్థితిలో కాలువలు ఉన్నాయి. పక్కనే ఉండే పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం కనిపిస్తోంది.



నేతాజీనగర్ వద్ద గుర్రపు డెక్కతో పూడుకుపోయిన వాడ మురుగు డ్రెయిన్

రేపల్లె: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా అటు పాలకులు, ఇటు అధికారులు పూడికతీతపై నోరు మెదపడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌కు ముందే అవసరమైన డ్రెయిన్‌లలో తూటికాడ, గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలను తొలగించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

**రేపల్లె సబ్ డివిజన్‌లో ఇలా...**

రేపల్లె సబ్ డివిజన్‌లో ప్రధానంగా ఆర్ఎం డ్రెయిన్, బీఎం డ్రెయిన్, జగజ్జేరువు కాలువ, రేపల్లె మురుగు కాలువ, వాడ మురుగు డ్రెయిన్, రేపల్లె న్యూకోర్స్, ఓల్డ్ కోర్స్‌లలో తూటి కాడ, గుర్రపు డెక్క, ప్లాస్టిక్, చెత్త చెదారాలు పేరుకుపోయాయి. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, రేపల్లె మండలం, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలో 34,060 హెక్టారులలో ఖరీఫ్‌లో వరి సాగు అవుతుంది. ఇక్కడి వృథా నీరు, అధిక వర్షాలు కురిసిన సమయంలో వరద ఈ కాల్వల ద్వారానే ముందుకు పోవాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లే దు. పంట చివరి దశ నవంబర్, డిసెంబరు మాసాలలో ఈ ప్రాంతాలలో అధిక వర్షం పడుతుంది. దీంతో రైతన్నలు భయాందోళనలకు గురవుతున్నారు.

**యుద్ధ ప్రాతిపదికన చేస్తేనే..**

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూడికతీత చేపట్టకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలతో రైతులు కొంతమేర నష్టపోయారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన పూడిక తీత ప్రారంభిస్తేనే ప్రయోజనం ఉంటుంది. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

### త్వరలోనే పూడిక తీస్తాం

రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ప్రధాన మురుగు కాల్వలలో పూడికలు తీయించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. సాధ్యమైనంత త్వరలో పనులు ప్రారంభిస్తాం. సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, డ్రైనేజ్ విభాగ డీఈ

### పనులు చేపట్టాలి

పంట చేతికొచ్చే సమయంలో చిన్నపాటి వర్షం కురిసినా పొలంలో నీరు నిలుస్తుంది. ఈ ఇబ్బంది గట్టెక్కాలంటే డ్రెయిన్‌లలో పూడికతీత తీయించక తప్పదు. అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.

– డి.సుబ్బయ్య, రైతు, పేటేరు

### పంట నష్టం తప్పదు

డ్రెయిన్‌లు పూడుకుపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో పంటలు ముంపుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గుర్రపుడెక్క, తూటికాడలతోపాటు కాల్వలలో చెత్తను తొలగించాలి. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– పి.శ్రీనివాసరావు, రైతు, రేపల్లె



## మోకాళ్లపై కార్మికుల నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, నాయకులు

మంగళగిరి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వై. కమలాకర్, ఎం. బాలాజీ, యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, కేదారనాథ్, దుర్గారావు, ప్రకాష్, రాము పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట టోకరా

- ఢిల్లీలోని విద్యాంజలి సంస్థ పేరుతో నియామక ఉత్తర్వులు
- నిరుద్యోగ యువతకు ఎరవేస్తున్న మోసగాళ్లు
- ఉద్యోగాల పేరుతో మోసపోవద్దని సమగ్ర శిక్ష ఎస్పీడీ సూచన



విద్యాంజలి సంస్థ పేరుతో సృష్టించిన తప్పుడు నియామక పత్రం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాల పేరుతో మోసగాళ్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులను పోలిన నియామక పత్రాలను సృష్టించి, బురిడీ కొట్టిస్తున్నారు. విద్యాంజలి సంస్థ పేరుతో కొంత మంది వ్యక్తులు జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, యోగా టీచర్లు, అటెండర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తప్పుడు నియామక ఉత్తర్వులను సృష్టించి, రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాజాగా విద్యాంజలి సంస్థ పేరుతో గుంటూరు జిల్లా తుళ్లూరులోని జెడ్పీ హైస్కూల్లో ఒకేషనల్ ట్రైనర్‌ను నియమిస్తున్నట్లుగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం పంపుతున్నట్లుగా సిద్ధం చేసిన నియామక ఉత్తర్వుల కాపీ ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. జెడ్పీ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ నియామక విషయమై సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు దృష్టికి వెళ్లడంతో ఆయన ఇదంతా బోగస్ అని, ఎవ్వరూ నమ్మవద్దని కొట్టిపారేశారు. క్షేత్రస్థాయిలో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుని నిరుద్యోగ యువత మోసపోకుండా చూడాలని సమాచారం పంపారు. ప్రధానోపాధ్యాయులు కూడా తప్పుడు నియామక ఉత్తర్వులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

### రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి

రేపల్లె: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వేణు కథనం ప్రకారం.. రేపల్లె – పల్లికోన రైల్వే స్టేషన్‌ల మధ్యలో గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి మృతి చెందినట్లు గ్యాంగ్‌మేన్ ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతునికి 30 నుంచి 35 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. రైలులో ప్రయాణిస్తూ జారి పడిపోయి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. అతడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. శరీరంపై బూడిద రంగు కలర్ జీన్స్ ప్యాంట్ ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తెనాలి జీఆర్‌పీ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని కోరారు. ఏ రైలు కింద పడ్డాడో తెలియరాలేదన్నారు. వివరాలకు 94406 27554 ఫోను నంబరులో సంప్రదించాలని సూచించారు.

## బాలిక హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ప్రత్యేక దృష్టి సారించిన డీఎస్పీ
- 24 గంటల్లోపు వివరాల సేకరణ



హేమ మృతదేహం

తాడేపల్లి రూరల్: కుంచనపల్లి జాతీయ రహదారిపై గల బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి పైనుంచి బాలికను నీటిలోకి విసిరేసి హత్య చేసిన సంఘటనలో 24 గంటలు గడవకముందే బుధవారం తాడేపల్లి పోలీసులు వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఓ మహిళ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. పోలీసులు మూడు గంటలు కష్టపడి బాలిక మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వెంటనే నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి, మంగళగిరి పట్టణ, రూరల్, పెదకాకాని సీఐ, ఎస్ఐలతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కుంచనపల్లి బ్రిడ్జి వద్ద, జాతీయ రహదారిపై ఉన్న కెమెరాలను పరిశీలించారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో బాలికను గుర్తు తెలియని వ్యక్తి నడిపించుకుంటూ బ్రిడ్జి ఎక్కినట్లు నమోదైంది. మృతి చెందిన బాలిక, సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న బాలిక ఒకరే కావడంతో ఫొటోలను కృష్ణా, గుంటూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపారు. వివరాలు సేకరించాలంటూ కోరారు. తాడికొండ మండలం బడేపురానికి చెందిన పాపగా గుర్తించడంతో అక్కడకు వెళ్లి వివరాలు సేకరించా రు. పేరు కూరపాటి హేమ అని, మతిస్థిమితం లేదని స్థానికులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పాపను పెంచలేక తాతయ్య ఈ పని చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలువలోకి తోసిన వ్యక్తి సరిగ్గా కనిపించకపోవడంతో పాటు లుంగీ ధరించి ఉన్నాడు. తాడేపల్లి సీఐ వీరేంద్ర హత్య చేసింది తాతయ్యా లేక ఎవరన్నా ఉన్నారనే విషయాలను లోతుగా దర్యాప్తు చేశారు. చివరికి తాత కూరపాటి మాధవరావే కాల్వలోకి తోసేశాడని పోలీసులు నిర్ధారించారు.